# రుణమాఫీ జమయ్యేనా?

- నాల్గో విడతలో రూ.56 కోట్లు
- ప్రభుత్వం ప్రకటించి 20 రోజులైనా ఉలుకు పలుకు లేదు
- సగానికి పైగా పెండింగ్‌లోనే..
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- సొసైటీలు, బ్యాంకుల వద్ద ఆరా
- అర్హత ఉన్నా మాఫీ కాకపోవడంతో రైతుల్లో ఆందోళన



మెదక్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ హామీల్లో ముఖ్యమైనది పంట రుణమాఫీ. క్రాప్ లోన్ తీసుకున్న రైతులకు రుణమాఫీ ప్రకటించారు. అనంతరం పెట్టిన నిబంధనలు, బ్యాంకుల కొర్రీలతో కర్షకులు సతమతమవుతున్నారు. ఇప్పటికే మూడు విడతల్లో రుణమాఫీ సొమ్ము విడుదలైనా, దాంతో 50 శాతం మంది రైతులకు కూడా లబ్ధి చేకూరలేదు. ప్రభుత్వ నిబంధనలు సగం మంది రైతులను రుణమాఫీకి దూరం చేస్తే.. బ్యాంకర్లు విధిస్తున్న కొర్రీలు ఆవేదనకు గురిచేస్తున్నాయి. దీంతో రుణమాఫీ పథకం రైతుల పాలిట శాపంగా మారింది. రుణమాఫీ విషయంలో అపోహలు, అనుమానాలు, నివృత్తి చేయడం, రుణమాఫీ వర్తించని రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ డెస్క్‌కు ఫిర్యాదులు కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో సైతం రుణమాఫీ కోసం అర్జీలు ఎక్కువగానే వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మూడు విడతల్లో 82,294 మంది రైతులకు రూ.604.21 కోట్లు మాఫీ చేసింది. ఈ మూడు విడతల్లో ప్రభుత్వం విధించిన పరిమితి లోపు రుణాలున్న వారిలో చాలామంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు.

### నాలుగో విడత రుణమాఫీ?

నాలుగో విడత రుణమాఫీ జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డిసెంబర్ 9 నాటికి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులకు నాలుగో విడత రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. కానీ ఇప్పటివరకు రుణమాఫీ డబ్బులు రూ.56.87 కోట్లు బ్యాంకుల్లో జమ కాలేదు. దీంతో రైతులు వ్యవసాయ శాఖ, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడంతో ఎవరికీ చెప్పుకోవాలో తెలియక నానా తంటాలు పడుతున్నారు. ఆ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే టుబీ ప్రాజెస్.. డాటా నాట్ ఫౌండ్, నో రేషన్‌కార్డు, ఆధార్ నాట్ మ్యాచ్డ్, కుటుంబ నిర్ధారణ కానీ ఫ్యామిలీ, రుణం తీసుకున్న వ్యక్తి చనిపోయారని, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని, ఇలా వివిధ కారణాలతో రుణమాఫీ డబ్బులు జమ కాలేదని రైతులు దిగాలు చెందుతున్నారు. ఇలాంటి సాంకేతిక కారణాలతో జాబితాలో పేరు వచ్చినా చాలామంది రైతులు రుణమాఫీ లబ్ధికి దూరంగా ఉన్నారు. జిల్లాలో నాలుగో విడత 7248 మంది రైతులకు రూ. 56.87 కోట్లు ఇంకా జమ కాలేదు.

### జిల్లాలో నాలుగు విడతలు ఇలా..

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 98,848 మంది రైతులు రూ.1,018 కోట్లు అప్పుగా తీసుకోగా ప్రభుత్వం పెట్టిన కటాఫ్ తేదీకి విరుద్ధంగా, అలాగే రీ షెడ్యూల్ అయిన వారు 15 శాతం వరకు ఉంటారని అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 18 రకాల బ్యాంకులు ఉండగా, వాటి పరిధిలో 101 బ్రాంచ్‌లు ఉన్నాయి. 98,848 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. మొదటి విడతలో 48,251 మందికి రూ.240.78 కోట్లు, రెండో విడతలో 21,618 మందికి రూ.204.40 కోట్లు, మూడో విడతలో 12,425 మంది రైతులకు రూ.159.03 కోట్లు జమయ్యాయి. డిసెంబర్ 9న ప్రకటించిన నాలుగో విడత రుణమాఫీలో రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులకు రూ.7248 మందికి రూ.56.87 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. ఇప్పటి వరకు బ్యాంకుల్లో మాఫీ డబ్బులు జమకాలేదు. దీంతో రైతులు బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతూ తమకు పంట రుణమాఫీ అయ్యిందా అని ఆరా తీస్తున్నారు. కానీ వ్యవసాయ శాఖ అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావడం లేదు.

## ప్రభుత్వ పశు వైద్యశాలలో కల్లుదుకాణం



సూరంపల్లి గ్రామంలోని పశువైద్యశాలలో కొనసాగుతున్న కల్లు దుకాణం

- సూరంపల్లిలో కొనసాగుతున్న దందా
- దుకాణం నిర్వహణకు రూ.1.50 లక్షలు ముట్టజెప్పినట్లు సమాచారం

టేక్మాల్, డిసెంబర్ 27: మండలంలోని వేల్పుగొండ గ్రామంలో కల్లు డిపోను నిర్వహిస్తున్నారు. అక్కడ తయారు చేసిన కల్లును వేల్పుగొండతోపాటు సూరంపల్లిలో విక్రయిస్తున్నారు. అయితే సూరంపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ పశు వైద్యశాలలో కల్లు దుకాణం కొనసాగుతున్నది. ఇక్కడ కల్లు దుకాణం నిర్వహణ కోసం గ్రామాభివృద్ధికి రూ.1.50 లక్షలను గ్రామ పెద్దలకు ఫండ్‌గా చెల్లించినట్లు స్థానికులు చెబుతున్నారు. కొంతకాలంగా ఈ దుకాణం కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పశువులకు సంబంధిత సమస్యలు ఏమైనా ఉంటే వాటికి వైద్య సేవలు అందించడానికి నిర్మించిన పశు వైద్యశాలలో కల్లుదుకాణం నిర్వహించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నారు. పశు వైద్యశాల పక్కనే పల్లె దవాఖాన ఉండడం విషయం. వైద్య సేవల కోసం పల్లె దవాఖానకు వచ్చే ప్రజలు పక్కనే ఉన్న కల్లు దుకాణంతో ఇబ్బందులకు గురవుతున్నారు.




పల్లె దవాఖాన పక్కనే ఉన్న పశు వైద్యశాలలో కొనసాగుతున్న కల్లు దుకాణం

## మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్



వెల్దుర్తి, డిసెంబర్ 27: ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన బీస శ్రీనివాస్ నియామకమయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ శ్రీనివాస్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

## మెదక్ చర్చిలో మూడో రోజూ భక్తుల ప్రార్థనలు



చర్చి ఎదుట భక్తుల జనసందోహం



చర్చిలోని శిలువ వద్ద కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 27: క్రిస్మస్‌ను పురస్కరించుకుని మూడో రోజు శుక్రవారం మెదక్ చర్చిలో భక్తుల సందడి నెలకొన్నది. భక్తులు ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య, పాస్టర్లు డేవిడ్ రిచర్డ్స్, జైపాల్, శ్రీనివాస్‌లు భక్తులను ఆశీర్వదించారు. వసతిగృహాల్లో, చర్చి ఆవరణలోని చెట్ల కింద వంటవార్పు చేసుకున్నారు.

## అయ్యప్ప స్వామి మహా పడిపూజ



రామాయంపేట, డిసెంబర్ 27: పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయంలో మహాపడి పూజను పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గురుస్వాములు మర్కు నగేశ్, బొద్దుల సాగర్, మద్దెల స్వామి, సాయి స్వాములు హాజరయ్యారు. అనంతరం అన్నదానం చేశారు.

## మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలి

### సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి



పంచాయతీ కార్మికులతో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

శివ్వంపేట, డిసెంబర్ 27: పంచాయతీ ఉద్యోగ కార్మికులకు మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మండల కేంద్రంలో 27, 28 టోకెన్ సమ్మెకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల ఆరు నెలల పెండింగ్ వేతనాలివ్వాలని ప్రభుత్వానికి అనేకమార్లు విన్నవించినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాలతో జిల్లాలో పదులకుపైగా కార్మికులు ఆయా పనులు చేస్తూ మృతిచెందారన్నారు. దీంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. బకాయి పడిన పెండింగ్ వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జనవరి మొదటి వారంలోనే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. మండల అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి శంకర్, బాలకృష్ణ, వసంత, పద్మ, స్వామి, కృష్ణ పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



చేగుంట,డిసెంబర్27: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ డి మాండ్ చేశారు. చేగుంటలో మాట్లాడుతూ 18 ఏండ్ల నుంచి తక్కువ వేతనాలతో పనిచేస్తూ వేదన చెందుతున్నామన్నారు. తమ ను విద్యాశాఖలో విలీనం చేసి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. సమ్మె నేపథ్యం లో సమగ్ర శిక్షా ఉద్యోగుల బాధ్యతలను ప్రభుత్వం పాఠశాల ఉపాధ్యాయులకు కే టాయించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేశ్, కృష్ణమూర్తి, జిల్లా నాయకురాలు రేఖ, సుమతి, సురేందర్, దేశపతి, కృష్ణమూర్తి, అమరేశ్వరి, రమేశ్ పాల్గొన్నారు.

## సైబర్ మోసగాడి ఉచ్చులో విద్యార్థి

నర్సాపూర్, డిసెంబర్ 27: సైబర్ మోసగాడి ఉచ్చులో పడి విద్యార్థి నగదు పోగొట్టుకున్న ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా జుక్కల్‌కు చెందిన బాలయోగి నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. నవంబర్‌లో బాలయోగి వాట్సాప్ చూస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి నుంచి మెస్సేజ్ ద్వారా ఓ లింక్ వచ్చింది. ఈ లింక్ ఓపెన్ చేయగా టెలీగ్రామ్ యాప్ ఓపెన్ కాగా, అందులో బాలయోగి మెస్సేజ్ చేశాడు. రెస్టారెంట్‌కు రేటింగ్, రివ్యూ ఇస్తే తనకు డబ్బులు ఇస్తామని తిరిగి మెస్సేజ్ రూపంలో వచ్చింది. దీంతో బాలయోగి రేటింగ్స్ ఇవ్వడంతో కొంత డబ్బు వ చ్చింది. ఇలా పలుమార్లు డబ్బులు వచ్చి ఆ తర్వాత బాలయోగి ఖాతా నుంచి రూ.28,500 కట్టయ్యాయి. దీంతో బాలయోగి సైబర్ క్రైమ్ వాళ్లకు ఫిర్యాదు చేశాడు. బాలయోగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

కొల్చారం, డిసెంబర్ 27: సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల కారణంగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన కిష్టాపూర్ యువకులు ప్రసాద్, నవీన్ కుటుంబాలను జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మైనంపల్లి హనుమంత రావు, కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. ఇరు కుటుంబాలకు చెరో రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. ప్రభుత్వం తరపున పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు.

### ఎస్సై కుటుంబానికి..

కొల్చారం గ్రామానికి చెందిన ఎస్సై సాతెల్లి సాయి కుమార్ బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని కూడా పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, డి, శేఖర్, బాలరాజు ఉన్నారు.

## క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం




క్షయవ్యాధిని నిర్మూలించాలని సిబ్బంది ర్యాలీ

రామాయంపేట, డిసెంబర్ 27: క్షయ వ్యాధిని నిర్మూలించాలని డాక్టర్ భరత్, కౌన్సిలర్ దేమె యాదగిరి పేర్కొన్నారు. శుక్రవారం రామాయంపేటలోని ఆరో వార్డులో క్షయ వ్యాధి నిర్మూలన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వార్డు ప్రజలకు టీబీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజేంద్ర కుమార్, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## తూప్రాన్ మున్సిపల్‌లో అధ్వానంగా పారిశుధ్యం



శివాజీ వీధిలో పేరుకుపోయిన చెత్తను చూపిస్తున్న రాఘవేందర్ గౌడ్

### మున్సిపల్ మాజీ చైర్మన్ రాఘవేందర్ గౌడ్

తూప్రాన్, డిసెంబర్ 27: మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు, చెత్త సేకరణ, నిర్వహణ అధ్వానంగా ఉన్నదని మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి తప్ప, కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీకి కొత్తగా ఒరిగిందేమీలేదన్నారు. కనీసం చెత్త సేకరణ కూడా సరిగా లేదన్నారు. లక్ష్మీనర్సింహ ఫంక్షన్ హాల్, ఉదయ్ కిరణ్ దవాఖాన, లక్ష్మి అపార్ట్‌మెంట్ , శివాజీ వీధి, తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను చూసి అధికారులు, పాలకుల మీద అసహనం వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రొళ్ల శ్రీనివాస్ అరెస్ట్ హేయమైన చర్య అని, ఖండిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు సత్యలింగం, సత్తార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ఒకటో వార్డుకు చెందిన జక్కపురం నర్సింలు, సత్తార్, నర్సింలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.56, 500 చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. సత్తార్, ఇమ్రాన్, భాస్కర్, ప్రభాకర్, నాగరాజు, హైదర్‌ఖాన్ పాల్గొన్నారు.

## వరి నాట్లలో బీహారు కూలీలు



చిన్నశంకరంపేట, డిసెంబర్ 27: మండలంలో వరి నాట్లు ప్రారంభం కావడంతో కూలీల కొరతను అధిగమించడానికి కొంతమంది బీహారు నుంచి తెప్పించిన కూలీలతో నాట్లు వేస్తున్నారు. 15మంది కూలీలు ఒక రోజులో ఐదు నుంచి ఆరెకరాల్లో నాటు వేస్తున్నారు.

## తెలంగాణ స్టేట్ ఖేల్ కో-కన్వీనర్‌గా ప్రశాంత్



నిజాంపేట, డిసెంబర్ 27: ఏబీవీపీ స్టేట్ ఖేల్ కో-కన్వీనర్‌గా నిజాంపేటకు చెందిన ప్రశాంత్‌ను రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి నియమించారు. ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలు సిద్దిపేట జిల్లాలో నిర్వహిస్తున్నారు.

## విద్యుదాఘాతంతో గిరిజన మహిళ మృతి



బూలి (ఫైల్)

కొల్చారం, డిసెంబర్ 27: విద్యుదాఘాతానికి గురై గిరిజన మహిళ మృతి చెందిన ఘట న సంగాయిపేట తండాలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండ లంలోని సంగాయిపేట తండాకు చెందిన గుగులోతు బూలి(28) వేడి నీళ్ల కోసం కరెం ట్ హీటర్ పెట్టింది. ప్రమాదవశాత్తు హీటర్‌కు చేయి తగలడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కూతురు, కొడుకు ఉన్నారు. మృతురాలి భర్త శివ ఫిర్యాదు మేరకు కొల్చారం ఎస్సై మహమ్మద్ గౌస్ కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు.

## వైద్య శిబిరంలో 67మందికి వైద్యం

చేగుంట, డిసెంబర్ 27: చేగుంటలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 67మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కరణం నర్సింహులు తెలిపారు. లలిత మల్టీ స్పెషాలిటీ దవాఖాన, నేత్రాలయ కంటి వైద్యశాల సహకారంతో వివిధ రకాల జబ్బులకు శుక్రవారం ఉచిత వైద్య పరీక్షలు చేశారు. అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశారు.

## మాజీ ప్రధాని మన్మోహన్‌కు ఘన నివాళి

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 27: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు నివాళులలర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.



నర్సాపూర్ మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**రామాయంపేటలో**

రామాయంపేట, డిసెంబర్ 27: మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థిక వేత్త మన్మోహన్‌సింగ్ మృతి పట్ల నివాళులర్పించారు. మెదక్ చౌరస్తాలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి పార్టీలకతీతంగా నాయకులు నివాళులర్పించారు.

**నిజాంపేటలో..**

నిజాంపేట,డిసెంబర్27: నిజాంపేటలోని నూతన బస్టాప్ వద్ద నాయకులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం వ్యక్తం చేసి మౌనం పాటించారు. అనంతరం వారు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**టేక్మాల్‌లో..**

టేక్మాల్, డిసెంబర్ 27: దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపై మండల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్, జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

**వెల్దుర్తిలో..**

వెల్దుర్తి, డిసెంబర్ 27: మాజీ ప్రధాని, ఆర్థిక వేత్త మన్మోహన్‌సింగ్ మృతి పట్ల వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లో నాయకులు నివాళులర్పించారు. వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో, మాసాయిపేటలో నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కిష్టారెడ్డి, నర్సింలు, సిద్దిరాంలు గౌడ్, నాగరాజు ఆధ్వర్యంలో మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట, డిసెంబర్ 27: చిన్నశంకరంపేటలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటన్నారు.

**నర్సాపూర్‌లో..**

నర్సాపూర్, డిసెంబర్ 27: నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపై కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

**చేగుంటలో ..**

చేగుంట, డిసెంబర్ 27: చేగుంటలో దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌కు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతితో పాటు పలువురు నాయకులు నివాళుర్పించారు.

**రేగోడులో..**

రేగోడు, డిసెంబర్ 27: మాజీ ప్రధాని సేవలు మరువలేనివని మాజీ పీఏసీఎస్ చైర్మన్ శ్యామ్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



భూమేశ్ (ఫైల్)

కౌడిపల్లి, డిసెంబర్ 27: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తునికి గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వి వరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంద్రుగు భూమేశ్ (29) వ్యవసాయంతో పాటు టెంట్ హౌస్ నడుపుతూ జీవిస్తున్నా డు. వ్యాపారంతో పాటు వ్యవసాయం అ నుకూలించక చేసిన అప్పులు ఎలా తీర్చా లో తెలియక తన భార్యతో చెప్పు మదన ప డుతూ ఉండేవాడు. తన భార్యను తల్లిగారింటికి పంపించి ఇంట్లో ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

EDUCATION

★ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. JS అకాడమీ (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306-All

WANTED

★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.